సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



సాగులో మార్పులు అవసరం

పర్యావరణ మార్పులను సమష్టిగా ఎదుర్కొంటేనే మానవాళిని కాపాడుకోవచ్చని వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ అన్నారు.

వివరాలు 8లో ▸



ఉన్నత చదువులకు..

ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనందించేందుకు కేంద్రం పీఎం విద్యాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది.

వివరాలు 8లో ▸

జిల్లా అదనపు ఎస్పీగా రఘునందన్ రావు

సంగారెడ్డి జోన్: జిల్లా అదనపు అడ్మిన్ ఎస్పీగా సీహెచ్ రఘునందన్‌రావు నియమితులయ్యారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా భారీగా అదనపు ఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. ఇక్కడ అదనపు ఎస్పీగా విధులు నిర్వహించిన సంజీవరావు ఇటీవల క్రితం పదవీ విరమణ పొందిన సంగతి తెలిసిందే.

న్యూస్‌రీల్

అర్బన్ పార్కు పనులు పూర్తి చేయాలి

అటవీ అధికారులకు జాగో తెలంగాణ సంఘం వినతి



శ్రీధర్‌రావుకు వినతి పత్రం ఇస్తున్న రాములు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణ సమీపంలో చేపట్టిన అర్బన్ పార్కు పనులు పూర్తి చేయాలని జాగో తెలంగాణ సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాములు నేత తదితరులు అటవీశాఖ జిల్లా అధికారి శ్రీధర్‌రావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాములు నేత మాట్లాడుతూ..రూ.లక్షల వ్యయంతో చేపడుతున్న అర్బన్ పార్కు పనులు కొన్ని నెలలుగా నిలిచిపోయాయన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయించాలని, పిల్లల కోసం స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించాలని కోరారు.

ప్రభుత్వ బడుల్లో గుణాత్మక విద్య: డీఈఓ



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డీఈఓ

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందిస్తామని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇస్నాపూర్, రుద్రారం ప్రభుత్వ పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులను తిరిగి పరిశీలించి, గణితం బోధిస్తున్న అధ్యాపకులు సుందర్‌రావు తరగతిని గమనించి విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు చురుగ్గా సమాధానాలు చెప్పడంతో డీఈఓ అభినందించారు.

యూరియాపై ఆందోళన వద్దు

జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్



సంగారెడ్డి జోన్: జిల్లాలో యూరియాపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ స్పష్టం చేశారు. జిల్లాకు 38,873 మెట్రిక్ టన్నుల మేరకు అవసరం ఉండగా ఇప్పటి వరకు 31,111 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 514 మెట్రిక్ టన్నుల యూరియా డీలర్ల వద్ద, మార్క్‌ఫెడ్ శాఖ, బఫర్ స్టాక్ యూరియా 333 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు తెలిపారు. జిల్లాకు 6,912 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రావాల్సి ఉందన్నారు. ఈ నెలాఖరు నాటికి వస్తుందని చెప్పారు.

టెట్ తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలి: టీఎస్‌యూటీఎఫ్

సదాశివపేట(సంగారెడ్డి): ఉపాధ్యాయులకు టెట్ అర్హత తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. గురువారం పట్టణ, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో టెట్ తీర్పుపై సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...2010 తర్వాత నియామకమైన ఉద్యోగులందరికీ టెట్ ఉందని, అంతకుముందున్న ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదని గతంలో చెప్పినప్పటికీ ప్రస్తుతం టెట్‌ను తప్పనిసరి చేస్తూ తీర్పు ఇవ్వడం సరైందికాదన్నారు.

భూ రీసర్వేను నిలిపేయండి

అధికారులకు షాద్‌నగర్ గ్రామస్తుల వినతి

వట్‌పల్లి(అందోల్): భూ సమస్యలకు పరిష్కారం చూపని రీసర్వేని నిలిపివేయాలంటూ మండల పరిధిలోని షాద్‌నగర్ గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు వ్రాసిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. గురువారం గ్రామానికి వెళ్లిన తహసీల్దారు చంద్రశేఖర్‌తోపాటు సర్వే అధికారులు గ్రామానికి చేరుకోగానే గ్రామస్తులు వారిని ప్రశ్నించారు. ప్రతి సర్వే నంబర్‌ను పూర్తిగా సర్వే చేయాలన్నారు. సర్వేలో భూ పట్టాపాస్‌బుక్ ఆధారంగా కేటాయింపులు జరగడం లేదని దీంతో హెచ్చు తగ్గులతో అన్యాయం జరుగుతోందన్నారు. సర్వే ద్వారా భూసమస్యలు తొలుగుతాయని సర్వే చేపట్టిన అధికారులు ఎటువంటి పరిష్కారం చూపడం లేదని ఆరోపించారు. పరిష్కారం చూపితేనే సర్వే చేయాలని లేకుంటే నిలిపి వేయాలని తెలిపారు. డిజిటల్ సర్వే ఆధారంగా అధికారులు రికార్డులను రూపొందించే పనుల్లో నిమగ్నమయ్యే క్రమంలో ఇలా అభ్యంతరాలు వ్యక్తం అవుతుండటం చర్చనీయాంశంగా మారింది.

అడ్డగోలు అంచనాలు!

- ఈసారి వరి దిగుబడులు పెరుగుతాయని నివేదికలు
- పంటకు యూరియా అందక దిగుబడి ప్రశ్నార్థకమంటున్న రైతులు
- విమర్శలకు దారితీస్తున్న వ్యవసాయశాఖ లెక్కల తీరు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. రైతు వేదికల వద్ద రాత్రంతా జాగారం చేసి..రోజంతా క్యూలో నిలబడితే దొరికే ఒక్క బస్తా ఉన్న రెండు మూడెకరాలకు ఏ మాత్రం సరిపోవడం లేదు. సకాలంలో యూరియా అందక వరి పొలం రంగు మారడంతోపాటు, దిగుబడి పూర్తిగా పడిపోతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ, వ్యవసాయశాఖ అధికారులు మాత్రం ఈసారి వరి దిగుబడులు గతేడాది కంటే ఎక్కువే వస్తాయని లెక్కించారు. గతేడాదితో పోల్చితే ఎకరానికి 80 కిలోల దిగుబడి పెరుగుతుందని అంచనా వేయడం విమర్శలకు దారితీస్తోంది. గతేడాది (2024 ఖరీఫ్‌లో హెక్టారుకు 5.9 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ లెక్కించింది. ఈ ఖరీఫ్‌లో మాత్రం ఇది 6.1 మెట్రిక్ టన్నులకు పెరుగుతుందని అంచనా వేసింది. ఈ మేరకు ధాన్యం సేకరణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను తయారు చేయడం గమనార్హం.

ఈసారి 2.24 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ

జిల్లాలో మరో 20 రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. ఈ కొనుగోళ్లకు సంబంధించి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌ను అధికారులు సిద్ధం చేశారు. ఈసారి మొత్తం 55,826 హెక్టార్లలో వరి సాగైనట్లు వ్యవసాయశాఖ లెక్కించింది. ఇందులో సుమారు 12 వేల హెక్టార్లలో సన్న రకాలు ఉంటాయని గుర్తించింది. హెక్టారుకు దొడ్డు రకానికి 6.17 మెట్రిక్ టన్నుల చొప్పున, సన్న రకాలు 4.94 మెట్రిక్ టన్నుల చొప్పున దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ లెక్కన మొత్తం 3.29 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని తేల్చారు. ఇందులో రైతుల వినియోగం, స్థానిక అవసరాలు పోగా 2.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశారు. ఈ మేరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గన్నీబ్యాగులు, ధాన్యం తరలించేందుకు ట్రాన్స్‌పోర్టు, హమాలీలు, టార్పాలిన్‌లు ఇలా ధాన్యం సేకరణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇస్తున్నారు.

గతేడాది కంటే ఈసారి ఎక్కువేనా..

గతేడాది సుమారు 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎక్కువ కొనుగోలు చేయాల్సి ఉంటుందని అంచనాకు వచ్చారు. గతేడాది ఖరీఫ్ కొనుగోలు సీజనులో 1.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఈసారి సేకరణ మాత్రం రెండు లక్షల మెట్రిక్ టన్నులు దాటుతుందని భావిస్తున్నారు.

207 కొనుగోలు కేంద్రాలు..

ఈసారి 207 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇందులో 89 కేంద్రాలు ఐకేపీకి కేటాయించారు. 88 కేంద్రాల నిర్వహణను పీఏసీఎస్‌లకు అప్పగించారు. డీసీఎంఎస్‌కు 29 కేంద్రాలు నడపనున్నారు. సన్నధాన్యం సేకరణ కోసం ప్రత్యేకంగా ఎఫ్‌పీఓ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక అవసరాలను బట్టి ఈ కేంద్రాల సంఖ్యలో మార్పులు చేర్పులు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు.

అవి అంచనాలు మాత్రమే

ధాన్యం సేకరణకు సంబంధించి అంచనాలు మాత్రమే. గతేడాది కంటే వచ్చిన దిగుబడులను బట్టి అంచనా వేస్తాము. జిల్లాలో రైతులకు యూరియా దొరకడం లేదు అనే మాట అవాస్తవం. రైతుల అవసరాల మేరకు యూరియా సరఫరా చేస్తున్నాం. ఇప్పటివరకు 31 వేల మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేశాం. వరి ఇప్పుడు పూత దశలో ఉంది. అందుకే ఆ స్థాయిలో అంచనాలు వేశాం.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యం

- జాతీయస్థాయి క్రీడాకారుల తయారీకి సీఎం ప్రత్యేక చొరవ
- జిల్లాస్థాయి కబడ్డీ పోటీల ప్రారంభ సభలో ఎంపీ సురేశ్ షెట్కార్



క్రీడా జ్యోతి వెలిగించి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ షెట్కార్

జహీరాబాద్: రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ స్పష్టం చేశారు. మండలంలోని రంజోల్ గ్రామంలో గురువారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను షెట్కార్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామస్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయికి క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పనున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని విద్యాలయాలలో పీఈటీలను నియమిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మీకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా ప్రభుత్వం తరపున కానీ, తన తరపున కానీ అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీనిచ్చారు. తాను కూడా కబడ్డీ ఆడేవాడినని, జహీరాబాద్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు గుర్తు చేసుకున్నారు.

కబడ్డీ ఆడిన ఎంపీ

ఈ సందర్భంగా అండర్-14, అండర్-17 విభాగాల్లో 28 మండలాలకు చెందిన 56 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. అంతకుముందు క్రీడాకారులు పరేడ్ నిర్వహించి ఎంపీకి గౌరవ వందనం చేశారు. కొద్దిసేపు క్రీడాకారులతో కలసి ఎంపీ షెట్కార్ కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు, ఆత్మ చైర్మన్ రామలింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి జి.శుక్లవర్ధన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేశ్‌గౌడ్, ఏబీఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రారంభ మ్యాచ్ ఆడుతున్న ఎంపీ షెట్కార్



మెదపల్లి గ్రామ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద



వరదనీరు పొంగిపొర్లిన కాలనీల్లో సహాయక చర్యల్లో కమిషనర్ జ్యోతిరెడ్డి

పలుచోట్ల కురిసిన భారీ వర్షం

- నీట మునిగిన పంటలు
- పొంగి పొర్లిన వాగులు, వంకలు

సంగారెడ్డి జోన్/పటాన్‌చెరు: జిల్లాలోని పలుచోట్ల మరోసారి భారీ వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఉరుములతో కూడిన వర్షం కురిసింది. రాత్రి సమయంలో భారీ వర్షం కురవడంతో రహదారులపై రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంతోపాటు జహీరాబాద్, ఝరాసంగం, పటాన్‌చెరు, సదాశివపేట, రామచంద్రపురం ప్రాంతాలలో అత్యధికంగా వర్షం కురిసింది. 9.5 సెంటీమీటర్లతో రామచంద్రపురంలో అత్యధికంగా నమోదైంది. ఝరాసంగంలోని కేతకీ ఆలయం ముందు ఉన్న వాలద్రి వాగు, ప్యారవరం, మెదపల్లి వాగులు పొంగి పొర్లాయి. సంగారెడ్డి పట్టణంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. పంట పొలాల్లో పూర్తిగా వర్షపునీరు నిలిచిపోయింది. నారింజ వాగు, నిమ్జ్ రహదారి పక్కనే ఉన్న పంట పొలాల్లో నుంచి వరద నీరు ప్రవహించింది.

అత్యధికంగా వర్షపాతం నమోదైన మండలాలు

మండలం	వర్షపాతం(సెం.మీ)
రామచంద్రాపురం	9.5
భెల్	8.9
పటాన్‌చెరు	7.4
జహీరాబాద్	7.0
ఝరాసంగం	6.8

ఇళ్లలోకి వరద

అమీన్‌పూర్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన దుర్గా హోమ్స్, సెంథన్, టీచర్స్ కాలనీల్లో వరద ఇళ్లలోకి చేరింది. వరదతోపాటు డ్రైనేజీ నీరు ఆ కాలనీవాసులను తీవ్ర ఇబ్బందులకు లోను చేసింది. కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. కమిషనర్ జ్యోతిరెడ్డి బుధవారం అర్ధ రాత్రి వరకు కాలనీలోనే ఉండి కాలనీవాసులకు భరోసా కల్పించారు.

ఉపాధి హామీ పథకం పనుల అమలు భేష్

మహారాష్ట్ర అధికారుల బృందం

కంది(సంగారెడ్డి): ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు బాగున్నాయని మహారాష్ట్ర అధికారుల బృందం కితాబునిచ్చింది. కంది మండలం చేర్యాల గ్రామపంచాయతీని గురువారం మహారాష్ట్ర అధికారుల బృదం పరిశీలించింది. ఈ సందర్భంగా గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం, శ్మశాన వాటిక, పాఠశాల ప్రహరీ గోడ, కిచెన్‌షెడ్, పల్లె ప్రకృతి వనం నిర్మాణాలను పరిశీలించారు. అలాగే గ్రామపంచాయతీలో రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ విధానం అమలవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ అదనపు పీడీ పూజ, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, ఉపాధి హామీ ఏపీఓ గురుపాదం తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సేవలపై అవగాహన

- హుగ్గెల్లిలో పర్యటించిన యూపీ సర్పంచ్‌ల బృందం
- పాల్గొన్న జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి



రైతు వేదిక వద్ద యూపీ సర్పంచ్‌ల బృందం

జహీరాబాద్: తెలంగాణలో ప్రజలకు అందిస్తున్న ఆన్‌లైన్ సేవల గురించి జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి ఉత్తరప్రదేశ్ సర్పంచ్‌ల బృందానికి అవగాహన కల్పించారు. మండలంలోని హుగ్గెల్లి గ్రామానికి ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం నుంచి గురువారం 30 మంది సర్పంచ్‌లు, కార్యదర్శుల బృందం వచ్చింది. ఈ సందర్భంగా రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలకు గ్రామాలలో ఆన్‌లైన్ విధానంలో అందిస్తున్న సేవల గురించి జానకీరెడ్డి, ఇతర అధికారులు ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. జనన, మరణ ధ్రువపత్రాలు జారీ చేయడం, ఆన్‌లైన్‌లో ఇంటి అనుమతులు పొందడం, జనన మరణాల నమోదు చేయడంతో పాటు ఎన్ని రకాల సేవలను అందిస్తున్నామనే విషయాల గురించి తెలిపారు.

రక్షణ చట్టాలు కల్పించాలి

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి



జిల్లా కోర్టు ముందు నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సంగారెడ్డి టౌన్: న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టాలు కల్పించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టం కోసం నిర్వహిస్తున్న రెండు రోజుల దీక్ష కార్యక్రమాన్ని భగ్నం చేసినందుకు నిరసనగా గురువారం జిల్లా కోర్టులో విధులు బహిష్కరించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వం స్పందించి న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వేగంగా ఇళ్ల బిల్లులు మంజూరు

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా పాఠశాలల తనిఖీ



వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కొండాపూర్(సంగారెడ్డి): ఎలాంటి జాప్యం లేకుండా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు మంజూరవుతున్నాయని, లబ్ధిదారులు కూడా తమ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇంకా ఫోటో అప్‌లోడ్ చేయనవి ఉంటే ఆలస్యం చేయకుండా వెంటనే చేయాలని హౌసింగ్ ఏఈ లను ఆదేశించారు. మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా పాఠశాలలతోపాటు ఇందరిమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో, ఔట్ పేషంట్, ఇన్ పేషంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జనరల్‌వార్డును పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా గ్రామాలలో జ్వర సర్వేలు నిర్వహించాలని ఆదేశించారు. మురుగునీరు గ్రామాల్లో నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కేజీబీవీని సందర్శించి...

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ తరగతి గదులు, రిజిస్టర్లు, వంటశాల, సామాగ్రి భద్రపరిచే గది, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలను సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్య లు తీసుకుంటుందన్నారు. మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యమైన నిత్యవసర సరుకులు, తాజా కూరగాయలను వినియోగించాలని, వంట సిబ్బంది పరిశుభ్రత నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణు గోపాల్, తహసిల్దార్ అశోక్,, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వసతుల మాట.. ప్రగతి బాట

పల్లెల్లో మౌలిక వసతుల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా గ్రామ పంచాయతీలలో ఏ సౌకర్యాలు ఉన్నాయి? ఇంకా ఏ సౌకర్యాలు కల్పించాలనే దానిపై పంచాయతీ శాఖ సర్వే నిర్వహిస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 1,613 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు వివరాలు సేకరిస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ రిపోర్ట్ అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను వినియోగించనున్నారు.

– సాక్షి, సిద్దిపేట

- పల్లెల్లో మౌలిక వసతులపై ఆరా
- పంచాయతీ కార్యదర్శుల సర్వే
- 21 అంశాలలో వివరాలు సేకరణ
- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 1,613 గ్రామ పంచాయతీలు

పంచాయతీ శాఖ అధికారుల ఆదేశాల మేరకు గురువారం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సర్వే ప్రారంభించారు. 21 అంశాలలో పంచాయతీ కార్యదర్శులు సర్వే చేపడుతున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు, పంచాయతీ కార్యాలయాలకు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్ సెంటర్లకు బిల్డింగ్‌లు ఉన్నాయా? లేవా? అనే వాటిని పరిశీలించి నమోదు చేస్తున్నారు. పాలసేకరణ కేంద్రం, పశు వైద్య ఉప కేంద్రం, లింకు రోడ్లు, ఇంకుడు గుంతలు, ట్రాక్టర్ ట్రాలీల సమాచారాన్ని సైతం నమోదు చేస్తున్నారు.

మూడు భాగాలుగా విభజన

సర్వేలో వచ్చే వివరాల ఆధారంగా ఎంపీడీఓ, డీపీఓల ధ్రువీకరణతో జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలలో వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, అభివృద్ధి చెందిన గ్రామాలుగా ఇలా మూడు భాగాలుగా విభజించనున్నారు. వీటిని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనరేట్‌కు పంపించనున్నారు. అందులో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను ముందుగా గుర్తించి వాటిని ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించనున్నారు. అలాగే ఇంటి, ఆస్తుల బదిలీల వాటా, నల్లా బిల్లు, దుకాణాలకు సంబంధించిన పన్ను రూపంలో వస్తున్న ఆదాయం? అలాగే గ్రామాల్లో ఇతర ఆదాయ వనరులను సృష్టించడం కోసం ప్రణాళికలు తయారుచేయనున్నారు.



అక్కన్నపేట మండలం బోడిగెపల్లిలో వివరాలు నమోదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

రెండు రోజుల్లో పూర్తి



గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సర్వే ప్రారంభించారు. సర్వే రెండు రోజుల్లో పూర్తి కానుంది. గ్రామంలో ప్రభుత్వానికి చెందిన కార్యాలయాలు, మౌలిక వసతుల వివరాలన్నీ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ వివరాలను పంచాయతీ రాజ్ కమిషనర్‌కు పంపిస్తాం.

– దేవకీదేవి, డీపీఓ, సిద్దిపేట

జిల్లా	పంచాయతీలు
సిద్దిపేట	508
సంగారెడ్డి	613
మెదక్	492

క్లుప్తంగా

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపికైనట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, స్కూల్ గేమ్ ఫెడరేషన్ వర్కింగ్ సెక్రటరీ సౌందర్య తెలిపారు. గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన హ్యాండ్ బాల్ పోటీల్లో జిల్లా విద్యార్థులు రాణించి ఉమ్మడి మెదక్ జిల్లా టీంలకు ఎంపికయ్యారన్నారు. అండర్-14 బాలుర విభాగంలో 7 మంది, అండర్-14 బాలికల విభాగంలో నలుగురు, అండర్-17 బాలుర విభాగంలో 5 మంది, అండర్-17 బాలికల విభాగంలో 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సిపూర్‌లో ఉన్న మహాత్మాజ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన పదో తరగతి విద్యార్థులు కిరణ్, భవదీష్‌లను ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి అభినందించారు. అదే విధంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కోసం కృషి చేసిన పీఈటీ తరుణ్‌రాజ్‌లను పాఠశాల సిబ్బంది అభినందించారు. అయితే ఈ నెల 25నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లా ముప్కాల్ జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు కొడకండ్ల విద్యార్థులు
గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు గజ్వేల్ మండలంలోని కొడకండ్ల పీఎంశ్రీ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ విశాల పేర్కొన్నారు. ఈ మేరకు సాత్విక్, అక్షయ, హర్షవర్ధన్, అవంతిక, రమ్యలు అత్యుత్తమ ప్రతిభను చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బుచ్చిబాబు

దుబ్బాక: మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలకు ఎంపికయ్యారు. గురువారం జరిగిన జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీల్లో మొత్తం 12 విభాగాలకు గాను 6 విభాగాల్లో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో నాలుగు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. థియేటర్ ఆర్ట్ విభాగంలో పదో తరగతికి చెందిన ఐశ్వర్య, త్రీడీ ఆర్ట్ సమూహంలో స్పజన ప్రథమ స్థానాల్లో నిలిచారు. అలాగే 2 డీ ఆర్ట్ విభాగం డ్రాయింగ్‌లో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి క్రాంతికుమార్ ద్వితీయ స్థానం పొందారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఎంఈఓ ప్రభుదాసు, ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మీ నర్సవ్వ, సీఆర్పీ నవీన్ తదితరులు అభినందనలు తెలిపారు.

స్తంభంపై నుంచి పడి పంచాయతీ వర్కర్ మృతి



నర్సింలు (ఫైల్)

రామాయంపేట(మెదక్): మండలంలోని లక్ష్మాపూర్‌లో పంచాయతీ వర్కర్‌గా పనిచేస్తున్న అనుముల నర్సింలు (38) గురువారం ఉదయం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఉదయం గ్రామంలో తాగునీరు సరఫరా చేసే బోరు మోటర్ పనిచేయకపోవడంతో నర్సింలుతో పాటు మరో ఇద్దరు పంచాయతీ వర్కర్లు ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసి విద్యుత్ లైన్లను పరిశీలించారు. అనంతరం ఊర కుంటలో నీటిలో మునిగి ఉన్న కరెంటు స్తంభంపై వైర్లు రెండు ఒకే చోట కలవడంతో కరెంటు ట్రిప్ అవుతుందని మనించారు. ఈ సమయంలో నర్సింలు చెరువులో ఉన్న స్తంభం ఎక్కుతున్న క్రమంలో నీటిలో పడిపోయాడు. స్తంభం పై నుంచి నీటిలో పడిపోయిన నర్సింలు పైకి తేలకపోవడంతో వెంటనే గాలించారు. కొద్దిసేపటి తర్వాత అతని మృతదేహం లభించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మృతి

నారాయణఖేడ్: నిజాంపేట్‌లోని జాతీయ రహదారి 161 ఫ్లైఓవర్ కింద 85 ఏళ్ల వృద్ధురాలు గురువారం మృతి చెందింది. పెద్దశంకరంపేట మండలంలోని మల్కాపూర్‌కు చెందిన వడ్డెర చిన్నమ్మ(85) భిక్షాటన చేస్తూ జీవిస్తుందని స్థానికులు తెలిపారు. ఆమెకు సంబంధించిన వ్యక్తులు ఎవ్వరూ లేరని, భిక్షాటన చేసుకుంటూ ఫ్లైఓవర్ వద్ద నివసించేదని స్థానికులు తెలిపారు.

ఉన్నత చదువులకు ప్రోత్సాహం

పేద విద్యార్థులకు వరం ‘పీఎం విద్యాలక్ష్మి’

- హామీపత్రం లేకుండా విద్యార్థులకు రుణాలు
- అర్హులకు 15 రోజుల్లోనే మంజూరు

మెదక్ కలెక్టరేట్: ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ఆర్థిక చేయూత కల్పించాలనే ఉద్దేశంతో కేంద్రం వికసిత భారత్ లక్ష్య సాధనలో భాగంగా ‘పీఎం విద్యాలక్ష్మి’ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉన్నత విద్యా సంస్థల్లో చదివేందుకు ఈ పథకం కింద ఎలాంటి హామీపత్రం అవసరం లేకుండానే బ్యాంకుల నుంచి రుణాలు పొందే వెసులుబాటును కల్పించింది.

బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేదు..
ఉన్నత చదువులకు అవసరమయ్యే రుణాల కోసం విద్యార్థులు బ్యాంకులకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే విద్యార్థులు బ్యాంకుల చుట్టూ తిరగకుండా దరఖాస్తు చేసిన 15 రోజుల్లోనే తక్కువ వడ్డీతో రుణం మంజూరయ్యేలా కేంద్రం ‘పీఎం విద్యాలక్ష్మి’ పథకాన్ని ప్రారంభించింది. రుణం అవసరమైన విద్యార్థి నేరుగా దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. మంజూరు చేసే రుణంలో చదువుకు అయ్యే ఖర్చులు మాత్రమే కాకుండా ట్యూషన్ ఫీజు, వసతి, రవాణా ఖర్చులన్నింటినీ కలుపుతారు. ఇందులో దరఖాస్తు ఫీజు, ప్రాసెసింగ్ చార్జీలు ఏమి ఉండవు. మొత్తం మూడు రకాలుగా రుణాలు ఇస్తారు. మొదట దశ రూ.4 లక్షల వరకు, రెండో దశ 4 నుంచి రూ.7.5 లక్షల వరకు, మూడో విడత రూ.10 లక్షల వరకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తారు.

కావాల్సిన పత్రాలివే..
పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మెమోలతో పాటు చివర చదివిన కోర్సుకు సంబంధించిన ఉత్తీర్ణత పత్రం, చేరనున్న కోర్సుకు చెందిన అడ్మిషన్ పత్రాలు, ఆదాయ ధృవీకరణ పత్రం, రుణానికి దరఖాస్తు చేయడం కోసం ఏడాది ముందు చదివిన కోర్సు ఉత్తీర్ణత సాధించి ఉండాలి. అయితే మార్కులు, పర్సెంటేజీలతో అవసరం లేదు. విద్యార్థులు తమ అవసరానికి అనుగుణంగా దరఖాస్తు చేసుకోవచ్చు.

గడువు తేదీ లేదు..
విద్యాలక్ష్మి వెబ్‌సైట్‌లో పేరు, మొబైల్ నంబర్, ఈ మెయిల్ ఐడీ, చిరునామా తదితర వివరాలను రిజిస్టర్ చేసుకోవాలి. ఆ తర్వాత కామన్ ఎడ్యుకేషన్ లోన్ అప్లికేషన్ ఫాంను పూర్తిచేయాలి. అవసరమైన ధృవపత్రాలను అప్లోడ్ చేయాలి. ఒక విద్యార్థి ఒక దరఖాస్తు మాత్రమే పంపాల్సి ఉంటుంది. దరఖాస్తు స్టేటస్‌ను విద్యాలక్ష్మి పోర్టల్‌లో బ్యాంకు అప్డేట్ చేయగా.. 15 రోజుల్లో రుణ మంజూరు వివరాలు తెలుస్తాయి. అవసరమైన ధృవపత్రాలు లేకపోతే రుణం మంజూరయ్యే అవకాశం ఉండదు. పోర్టల్‌లోని డాష్‌బోర్డులో చూసి విద్యార్థి విషయం తెలుసుకోవచ్చు. వీటికి ఎలాంటి గడువు తేదీ ఏమి లేదు.

ఈ కోర్సులకు రుణాలు..
విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.4 లక్షల లోపు ఉండాలి. అలాగే ఇంజనీరింగ్, టెక్నికల్ కోర్సులు, వృత్తి సంబంధిత కోర్సులైన ఎంబీబీఎస్, ఆర్కిటెక్చర్, లా, చార్టర్డ్ అకౌంటెన్సీ, అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ చదివే విద్యార్థులకు రుణాలు అందించనుంది. దీంతో పాటు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేవారికి రుణాలు మంజూరు చేస్తారు.

ప్రాణాలను పణంగా పెట్టి కాపాడాడు

- ప్రతి ఒక్కరూ ఇతరులకు సహాయ పడాలి
- దేవిసింగ్‌ను సన్మానించిన ఎస్పీ శ్రీనివాస్‌రావు



దేవిసింగ్‌ను సన్మానిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ మున్సిపాలిటీ: వరదల సమయంలో దేవిసింగ్ ప్రాణాలను పణంగా పెట్టి పది మందిని రక్షించాడని, ప్రతి ఒక్కరూ ఇతరులకు సహాయ పడాలని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు హవేళిఘణాపూర్ మండలంలోని రాజిపేట వంతెన వద్ద గంగమ్మ వాగు ఉధృతంగా ప్రవహించింది. ఈ సమయంలో బ్రిడ్జిపై దాదాపు 10 మంది చిక్కుకుపోయారు. వెంటనే రాజపేట్ తండాకు చెందిన దేవిసింగ్.. మాజీ సర్పంచ్ కిషన్ ప్రోత్సాహంతో ధైర్యంగా ముందుకు వచ్చి దాదాపు 5 గంటల పాటు శ్రమించి వారందరిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చాడు. ఇందులో భాగంగానే తన ప్రాణాలను పణంగా పెట్టి 10 మందిని రక్షించిన దేవిసింగ్‌తో పాటు అతని తండ్రి ధనుజ, రాజ్‌పేట మాజీ సర్పంచ్ కిషన్‌లను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఒకరికొకరు సహాయపడాలని తెలిపారు. దేవీసింగ్ పేరును జాతీయ స్థాయిలో ధైర్య సాహసాలకు అందించే పురస్కారాలకు సైతం నామినేషన్ వేసే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ రూరల్ సీఐ రాజా శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా డ్రగ్స్ ఫౌడర్ రవాణా

ఇద్దరి అరెస్టు

చేగుంట(తూప్రాన్): డ్రగ్స్ ఫౌడర్‌ను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సావెల్‌పాండే, నీలేష్ పాండేలు లారీలో గురువారం డ్రగ్స్ ఫౌడర్‌ను తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న నార్కోటిక్స్ డ్రగ్స్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మాసాయిపేట మండలం రామంతాపూర్ బాబారాందేవ్ రాజస్థాన్ దాబా సమీపంలో లారీని పట్టుకొని 5.8కేజీల పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను చేగుంట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారణ నిర్వహించగా మధ్యప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ ఫౌడర్ తీసుకెళ్తున్నట్లు ఒప్పుకున్నారు. అనంతరం లారీని స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యార్థి స్థాయి నుంచే సేవా భావం

అదనపు ఎస్పీ మహేందర్



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థి దశనుంచే సేవా కార్యక్రమాలు అలవాటు చేసుకోవాలని అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. గురువారం మండలంలోని రాయిలాపూర్‌లో నర్సాపూర్ డిగ్రీ కళాశాల యూనిట్-1 ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతోపాటు సేవాకార్యక్రమాలు ఎంతో ముఖ్యమన్నారు. ఎన్ఎస్ఎస్ శిబిరాల ద్వార క్రమశిక్షణ, సేవాభావం అలవడుతుందన్నారు. తాను సైతం విద్యార్థి దశలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు గుర్తు చేశారు. వారంరోజుల పాటు కుటుంబాన్ని విడిచి గ్రామంలో సేవాకార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం బాలికలు సైతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ శిబిరంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్, రాయిలాపూర్ హెచ్‌ఎం జ్యోతి, పంచాయతీ కార్యదర్శి సలీం, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజమౌళికి ఆత్మీయ సన్మానం



రాజమౌళిని సన్మానిస్తున్న కవులు

సిద్దిపేటజోన్: బాలవికాస యాత్ర పేరిట 314 పాఠశాలల్లో పిల్లలకు కథలు గేయాలు, పద్యాలు బోధించి కథల తాతయ్యగా పేరుపొందిన రాజమౌళికి సహచర కవులు ఆత్మీయ సన్మానం చేశారు. ఇటీవల వండర్ బుక్ ఆఫ్ రికార్డు లో చోటుదక్కిన రాజమౌళిని గురువారం స్థానిక పార్క్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ ప్రతినిధులు చంద్రయ్య, అశోక్, కనకయ్య, సురేందర్, భూమారెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు



పేకాట స్థావరంపై దాడి చేసి స్వాధీనం చేసుకున్న నగదు, ఫోన్లు

సిద్దిపేటరూరల్: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురిని అదుపులో తీసుకొని వారి నుంచి నగదు, ఫోన్లు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి శివారులో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం రావడంతో బుధవారం రాత్రి దాడి చేశారు. ఈ దాడుల్లో అదే గ్రామానికి చెందిన పాతూరి విజేందర్ వ్యవసాయ పొలంలోని షెడ్డులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో మ్యాకల ఎల్లారెడ్డి, దండు అశోక్, పాతూరి విజేందర్‌రెడ్డి, శ్యాగ శ్రీకాంత్‌రెడ్డి, సుతారి వెంకటరెడ్డి, తుపాకుల అంజాగౌడ్, కస్తూరి కార్తీక్‌రెడ్డి, రాయం రాజులు ఉన్నారు. అనంతరం వారి నుంచి రూ. 20,153ల నగదు, 7 మొబైల్ ఫోన్లు, 4 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే 8712667445, 8712667446, 8712667447 నంబర్‌లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

జీవితంపై విరక్తిచెంది భర్త ఆత్మహత్య



సాయికుమార్

వర్గల్(గజ్వేల్): భార్య పుట్టింటి వెళ్లి కాపురానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన వర్గల్ మండలంలోని మాదారంలో గురువారం చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మాదారానికి చెందిన అంకని సాయికుమార్(36) కూలీ పనులు చేస్తుంటాడు. ఆయనకు భార్య శ్యామల, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. అయితే కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు చోటుచేసుకోవడంతో రెండేళ్ల క్రితం పిల్లలతో కలిసి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. రెండు రోజుల క్రితం సాయికుమార్ భార్యను ఇంటికి రావాలని పిలవగా.. ఆమె నిరాకరించింది. దీంతో ఆవేదనకు గురై జీవితంపై విరక్తిచెంది బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం కుటుంబీకులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మనస్తాపంతో యువతి..



గుజరాతి రజిత

కొండపాక(గజ్వేల్): మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్నట్లు కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. కొండపాక మండలంలోని దమ్మక్కపల్లి మధిర పిట్టలవాడకు చెందిన గుజరాతి రజిత (22) మెడికల్ విభాగంలోని నర్సింగ్ కోర్సులో చేరేందుకు సిద్ధమవుతోంది. అయితే ఇటీవల బంధువుల్లో ఒకరిని ప్రేమించానని, అతడినే పెళ్లి చేసుకుంటానని ఇంట్లో చెప్పింది. దీంతో ఆ యువతి తల్లిదండ్రులు నర్సింగ్ కోర్సు పూర్తయ్యే వరకు పెళ్లి ప్రస్తావన తీసుకురావొద్దని సర్ది చెప్పారు. ఈ క్రమంలో ఈనెల 17న పొలం పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిందన్నారు. అయితే పెళ్లి విషయంపై మనస్తాపంతో రాత్రి 8 గంటలకు పురుగుల మందు తాగగా వాంతులు చేసుకొని పడి పోయింది. వెంటనే కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందిందన్నారు. ఈ మేరకు మృతురాలి తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో మహిళ మృతి



లారీ టైర్ మధ్యలో ఇరుక్కొని మృతి చెందిన విజయలక్ష్మి

సంగారెడ్డి టౌన్: లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ మహిళ మృతి చెందిన సంఘటన గురువారం సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సదాశివపేటకు చెందిన విజయలక్ష్మి (56), కుమారుడు ప్రతాప్, కోడలు అరుణ కలిసి బైక్‌పై వెళ్తున్నారు. అయితే పోతిరెడ్డిపల్లి చౌరస్తా సిగ్నల్ వద్ద వెనక నుంచి ఆయిల్ లారీ అతివేగంతో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయలక్ష్మి లారీ టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. అనంతరం లారీ డ్రైవర్‌ను అదుపులో తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కొనసాగుతున్న ‘కొండెంగల’ ఆపరేషన్

పది కొండెంగలను పట్టుకుని బంధించిన ప్రత్యేక బృందం

సాక్షి ఎఫెక్ట్..



ప్రత్యేక ఆపరేషన్‌తో బోనులో చిక్కుకున్న కొండెంగలు

జహీరాబాద్: పట్టణంలోని పలు కాలనీల్లో కొండెంగల దాడులతో ప్రజలు తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల పాలవుతున్న విషయంపై ‘సాక్షి’లో వరుస కథకాలు ప్రచురితమవుతున్నాయి. ఈ నేపథ్యంలో స్పందించిన అధికార యంత్రాంగం వాటిని బంధించే పనిలో పడింది. ఇందులో భాగంగానే గురువారం పట్టణంలోని రాంనగర్ కాలనీలో కొండెంగల ఆపరేషన్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా 10 కొండెంగలను పట్టుకుని బంధించింది. అయితే కొండెంగలు దాడులకు పట్టణంలోని శాంతినగర్, రాంగనర్, హమాలీకాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీల్లోని ప్రజలు ఆస్పత్రుల పాలయ్యారు. ఇప్పటి వరకు 25 మంది వరకు గాయపడ్డారు. దీంతో రహదారిపై నడుచేందుకు సైతం జంకుతున్నారు. ఎట్టకేలకు జిల్లా ఫారెస్టు అధికారి శ్రీధర్‌రావు, జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావులు స్పందించి ప్రత్యేక బృందంతో వాటిని బంధించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రస్తుతం కొండెగల తరలింపు ఆపరేషన్ కొనసాగుతోంది. శుక్రవారం శాంతినగర్‌లో వాటిని పట్టుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా తయారు చేయించిన బోన్‌లో తిను బండారాలు ఉంచి బంధిస్తున్నారు. ఆపరేషన్ కొండెంగల్ చేపట్టడంతో ఆయా కాలనీల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రత్యేక బృందానికి ఫారెస్టు అధికారులు కృష్ణమ్మ, కిరణ్‌కుమార్, భవానీ, సంజీవ్, ఆయా కాలనీ వాసులు రాములు నేత, ఇమ్రాన్, శివప్రసాద్, దశరథ్, ఫసీ, ఎల్లయ్య, శ్రీనివాస్, మల్లేష్ సహకారం అందిస్తున్నారు.

కార్లను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

గుండెపోటుతో వ్యక్తి మృతి



మృతి చెందిన రాజ్‌కుమార్‌పాల్

చేగుంట(తూప్రాన్): మాసాయిపేట శివారులో జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఓ ట్రావెల్స్ బస్సు ముందు వెళ్తున్న కార్లను ఢీకొనగా బస్సులోని వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నిజామా బాద్ వెళ్తున్న ఏసీ స్లీపర్ ట్రావెల్స్ బస్సు మాసాయి పేట శివారులో కార్లను ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఉత్తర్‌ప్రదేశ్ వాసి రాజ్‌కుమార్‌పాల్(35) మృతి చెందినట్లు గుర్తించారు. అయితే అతను మేడ్చల్‌లోని ఓ ఆస్పత్రిలో గుండెకు సంబంధించిన చికిత్స కోసం వచ్చి తిరిగి వెళ్తుండ గా మృతి చెందినట్లు తెలిసింది. పోలీసులు మృతుడి వివరాలు సేకరించి గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారించారు. అనంత రం కేసు నమోదు చేసి మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రెండు దుకాణాల్లో చోరీ

నర్సాపూర్: మండల కేంద్రంలో బుధవారం రాత్రి రెండు దుకాణాల్లో చోరీ జరిగిందని ఎస్ఐ లింగం తెలిపారు. పట్టణంలోని మార్కెట్ రోడ్డులోని రవిశంకర్‌కు చెందిన దుకాణం షెటర్ తాళం పగుల గొట్టి రూ.2వేల నగదు ఎత్తుకుపోయారని ఆయన చెప్పారు. అలాగే పట్టణంలోని కృష్ణచారి నగల దుకాణంలో 20తులాల వెండి ఎత్తుకుపోయారని చెప్పారు. ఇద్దరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మమ్మల్ని రెగ్యులరైజ్ చేయండి



మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేస్తున్న డైలీ వైజ్, కాంటినిజెంట్ వర్కర్లు

మోకాళ్లపై నిల్చుని డైలీ వర్కర్ల నిరసన

మెదక్ కలెక్టరేట్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీ వైజ్, కాంటినిజెంట్ వర్కర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ హాస్టల్ వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డైలీ వైజ్ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు దొడ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. 212 జీఓను సవరించి 2014 నాటికి ఐదెళ్ల సర్వీస్ ఉన్న అందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించడంతోపాటు పెండింగ్ వేతనాలు చెల్లించేందుకు ట్రెజరీలకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. కొత్త మెనూ ప్రకారం పెరిగిన పనిభారానికి అనుగుణంగా కార్మికులను వేతనాలు పెంచాలన్నారు. విద్యార్థులతో పాటు కార్మికులకు రెండు జతల యూనిఫాం, ఐడీ కార్డులు ఇవ్వాలన్నారు. దీంతో పాటు కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సునంద, కోశాధికారి మాధవి, సలహాదారు శేఖర్, ఉపాధ్యక్షుడు సువర్ణ, సభ్యులు భూలక్ష్మి, జ్యోతి, పెంటమ్మ, రజిత, కిషన్, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు



మాట్లాడుతున్న ఎస్ఐ వినయ్‌కుమార్

జహీరాబాద్ టౌన్: ఇద్దరు దొంగలను అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు టౌన్ ఎస్ఐ వినయ్ కుమార్ తెలిపారు. పట్టణ సమీపంలోని పస్తాపూర్ చౌరస్తా వద్ద పోలీసులు గురువారం వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ఈ సమయంలో ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి యతిన్చగా పట్టుకుని విచారించామన్నారు. పట్టణానికి చెందిన ఎండీ జమిలోద్దీన్, ఎండీ ఫైజోద్దీన్‌లు ఈ నెల 12 తేది రాత్రి బీదర్ చౌరస్తా వద్ద భవానీ వైన్స్‌లో రూ. 50 వేల నగదు, 15 మద్యం బాటిళ్లను చోరీ చేసినట్లు ఒప్పుకున్నారని చెప్పారు. అనంతరం వారి వద్ద రూ. 6,700 నగదు, మోటారు బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టులో రిమాండ్ చేశామని ఎస్ఐ వివరించారు. ఈ మేరకు దొంగలను పట్టుకున్న ఐడీ పార్టీ సిబ్బంది నర్సింలు, అస్లాం, ఓందేవ్, ఆనంద్, హరిలను అభినందించారు.

సాగులో మార్పులు అవసరం

- గ్లోబల్ యాక్షన్, లోకల్ ప్రొడక్షన్ పద్ధతిలో పంటల సాగు జరగాలి
- వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర
- పర్యావరణ మార్పుల ప్రభావంపై ములుగులో జాతీయ సదస్సు



బుక్స్ ఆవిష్కరిస్తున్న భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర

ములుగు(గజ్వేల్): పర్యావరణ మార్పులను సమష్టిగా ఎదుర్కొంటేనే మానవాళితోపాటు వ్యవసాయ, ఉద్యానరంగాలను కాపాడుకోవచ్చని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహపాత్ర అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన శాఖ, నాబార్డ్, ఎర్త్‌సైన్సెస్, డాక్టర్ రాజేంద్రప్రసాద్ అగ్రికల్చర్ యూనివర్సిటీలు పర్యావరణ మార్పుల ప్రభావంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ములుగు ఉద్యాన విశ్వవిద్యాలయం వేదికగా రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. చిన్న, సన్నకారు రైతాంగంపై పర్యావరణ మార్పుల ప్రభావం తగ్గించేందుకు అన్నిరకాల ప్రయత్నాలు జరగాలన్నారు. పర్యావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు రైతులు, ప్రజలతో పాటు వాతావరణ శాఖను ఇబ్బంది పెడుతోందన్నారు. ప్రస్తుతం నెలకొన్న పర్యావరణ మార్పులకు అనుగుణంగా సాగులో మార్పుతో పాటు పంటల ఎంపిక తగిన విధానాలు మార్చుకోవాలన్నారు. గ్లోబల్ యాక్షన్, లోకల్ ప్రొడక్షన్ పద్ధతిలో పంటల సాగు జరగాలన్నారు. వాతావరణంలో మార్పులకు సంబంధించిన ప్రతి చిన్న అంశాన్ని తక్షణమే దేశంలో ప్రతి పౌరుడికి అందాలన్నారు. పర్యావరణ మార్పులను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే పంటల వైపు పరిశోధనలు ముమ్మరం చేయాలన్నారు. అనంతరం సదస్సులో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు మాట్లాడుతూ వాతావరణంలో మార్పులను ప్రతి వ్యక్తి అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు ఆహార భద్రత కోసమే పరిశోధనలు జరిగాయని, దేశంలో పోషక భద్రత కోసం తగిన విధివిధానాలు రూపొందించుకొని పనిచేయాలన్నారు. ఈ లక్ష్యానికి పర్యావరణ మార్పులు అడ్డుగా నిలుస్తున్నాయని, వాతావరణ శాఖ, సాంకేతిక నిపుణులు, శాస్త్రవేత్తలు వీటి పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఉద్యాన వర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్. దండా రాజిరెడ్డి మాట్లాడుతూ ఉద్యాన రంగంపై పర్యావరణ మార్పుల ప్రభావం తగ్గించేందుకు, అవకాశమున్న ప్రతి సాంకేతిక, పరిశోధన అంశాన్ని రైతులకు చేరవేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఉద్యాన శాఖ, విశ్వవిద్యాలయం సంయుక్తంగా రైతులకు చేదోడువాదోడుగా ఉంటూ పర్యావరణ మార్పుల ప్రభావాన్ని అధిగమిస్తామన్నారు. అనంతరం నిపుణులు తీర్చిదిద్దిన ఇంట్రడక్టరీ అగ్రికల్చర్ మెటీరియాలజీ బుక్, బుక్ ఆఫ్ అబ్‌స్ట్రాక్ట్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్ భాస్కర్, బోర్లాగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రోగ్రాం లీడర్ డాక్టర్ ప్రమోద్ కుమార్ అగర్వాల్, వర్సిటీ రిజిస్టర్ భగవాన్, వాతావరణ శాఖ ఉద్యాన నిపుణులు, శాస్త్రవేత్తలు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.